# నేనే ఓడిపోయాను



తూర్పు తెల్లవారు తుండగానే వీధిలో ముగ్గు పెడుతున్న పార్వతి అల్లంత దూరంలోనే తన తల్లి, చెల్లెలు వస్తున్న జాడ కనిపెట్టి, ముఖం మాడ్చుకుంది.

'వస్తున్నాయి పాడు మొహాలు' గావన్ను! ఆ దిక్కుమాలిన అనుకుని, గబగబా ఇంట్లోకి పరు మొగాలు రెండూ వస్తున్నాయి గెత్తి నిద్రపోతున్న భర్తను లేపి మీ వాళ్ళేమో వస్తున్నారు ... 'మా తమ్ముడి పెళ్ళికి పిలవడానికి ఓ వార్నింగ్ పడేసి కాఫీ కాచడాని

కుపక్రమించింది తల్లి చెల్లెళ్ళను కుకసులో కొట్టుకుంటూ.

'పార్వతీ! పార్వతీ!' తలుపు గుద్దుతూ పార్వతిని పిలుస్తోంది తల్లి.

'ఆఁ! పార్వతికాదు! సింగనాథం' అనుకుంది పార్వతి.

'అక్కయ్యా; ఓ అక్కయ్యా!' చెల్లెలి పిలుపు.

పార్వతి భర్త శివరావు లేచాడు. పార్వతి ఉరిమి చూసింది. 'మీరెందుకు? మీరూరుకుండరూ! లేచారు పెద్ద గొప్పగా'

శివరావు ఆలోచనలో పడ్డాడు.

'పార్వతీ! పార్వతీ! అక్కయ్యా! తలుపు తలుపు' తలుపు దడదడలాడిపోతోంది.

ఇహ తట్టుకోలేకపోయాడు శివరావు. పార్వతి 'వెళ్ళకండి' అని శాసిస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళి తలుపు తీశాడు. 'రా... రండి' అని ఆహ్వానిస్తూ.

తల్లీ కూతుళ్ళు వచ్చి దానిమీద కూలబడ్డారు.

పార్వతి మండిపడి పోతోంది. అందుకే తన ముఖంకూడా వాళ్ళవైపు త్రిప్పకుండా బిర్ర బిగుచుక్కూచుంది.

'అమ్మాయ్ పార్వతీ! ఎల్లుండి రాత్రి మద్రాసులో పెద్ద తమ్ముడి పెళ్ళి. సాయంత్రం మీరు పిల్లలతో సహా ప్రయాణానికి సిద్ధంగా ఉండండి. కాస్త త్వరగా వెళ్ళకపోతే మెయిల్లో సీట్లు దొరకవు' అంటూ మొదలెట్టింది తల్లి.

ఈ ఆహ్వానం పార్వతిలో కించితైనా చలనం కలిగించలేదు.

'ఏమటావు పార్వతీ?' తల్లి ప్రశ్న.

పార్వతి ప్రవర్తనలో మార్పేమీ లేదు. ఇది సాంబశివరావుకు బాధ కలిగించింది. నెమ్మదిగా 'విన్నావా పార్వతీ! మంచి శుభవార్త. మీ పెద్దతమ్ముడు పెళ్ళితోబాటు మనకు మద్రాసుకూడా చూసే శుభయోగం కూడా పట్టింది' అన్నాడు నవ్వుతూ.

'మనకిక్కడొక్కటే తక్కువ' పొడిగా అంది పార్వతి.

పార్వతి ప్రవర్తన తల్లికిగాని, చెల్లికిగాని ఏమీ ఆశ్చర్యం కలిగించలేదు - తెలిసిన విషయమే కాబట్టి. అసలు పార్వతి లక్షణమే అంత. ప్రతి చిన్న విషయాన్నీ కొండంతచేసి తను బాధపడి ఎదటి వాళ్ళనుకూడా రాచి రంపాన పెడుతుంది— వాళ్లెవరైనా సరే! ప్రతిదీ తన ఇష్ట ప్రకారమే జరగాలనుకుంటుంది. ఒకవేళ వరాలు ముంచిందా?... ప్పులుతొక్కిన కోతిలా ప్రవర్తిస్తుంది. ఆ ప్రవర్తనలో ఏం చేస్తుందో కూడా ఎవరికీ తెలియదు.

అయినా ఏన్నకూడదు. మంచిగా పిన్నార్ని... దారిలోకి రావాలని తల్లి ఆపత్రయం... అందుకే 'పార్వతీ! ఎందుకే ఇట్లా మరీ అంత ఇదైపోతావు. అనవసరంగా కోపాలూ

కక్షలూ పెంచుకుంటే ప్రయోజనం ఏముందమ్మా నెమ్మదిమీద నేనంతా చక్కబరుస్తానని చెప్తూనే వున్నాగా 'శుభమ' అని తమ్ముడి పెళ్ళి జరగబోతూంటే నువ్విలా ప్రవర్తిస్తే ఏమన్నా బాగుందా? చెప్పు! తప్పులేమన్నా జరిగితే మావల్ల జరిగాయి గాని వాడేం తప్పు చేశాడు చెప్పు వాడి పెళ్ళికి రాకుండా మానడానికి! పెద్దక్క, పెద్దబావ రాకుంటే వాడి మనసెంత క్షోభకు గురవుతుందో కాస్త ఆలోచించు.' అంది తల్లి సౌమ్యంగా.

'ఈ వాదికథలన్నీ మాకేం వినిపించక్కర్లేదు. పెళ్ళికి రావాలో మానాలో మాకు బాగా తెలుసు. మీరొచ్చిన పనైందిగా! ఇహ దయ చెయ్యొచ్చు' ముఖం ఇటు త్రిప్పకుండానే వాడిగా విసిరింది మాటలు. శివరావుకే ఆ మాటలు ములుకుల్లా తగిలాయి. పాపం! వాళ్ళ కెలా ఉన్నాయో? తల్లి నిజంగానే మ్రాన్పడిపోయింది మాటరాక.

'ఏమిటి పార్వతీ ఆ మాటలు! నువ్వేనా' మెత్తగానే మందలించాడు శివరావు.

'మీకేం తెలియదు! మీరూరుకోండి! ఊరికేను' గదిమింది పార్వతి.

'అదికాదక్కయ్యా' చెల్లెలు లేచి పార్వతివైపు నడిచింది.

పార్వతి కసిపెట్టింది 'మా భారత భాగవత రామాయణాలు వినేవాళ్ళెవరూ లేరు. ఉన్నా టైమూ లేదు. మీరు తక్షణం నా ఇంట్లోనుంచి వెళ్ళిపోతే చాలా సంతోషిస్తాను. మళ్ళీ మీరు నా గుమ్మం తొక్కవలసిన పని కూడా లేదు వెళ్ళండి' తారస్థాయిలో అరిచింది పార్వతి.

చెల్లెలు స్తంభంలా నిలబడిపోయింది మధ్యలోనే—గ్రుడ్లనిండా నీరు కుక్కుకుని తల్లి సరే సరి.

పార్వతిని ఈ స్థితిలో అదుపులో పెట్టడం ఎవ్వరివల్లా కాదని గ్రహించిన శివరావు 'నేను నెమ్మదిగా చెప్పి సమాధానపరచి పెళ్ళికి తీసుకొస్తాగా! మీ రెందుకు! మీరు వెళ్ళండి! నేనున్నాగా' అని సంజ్ఞ చేశాడు అత్తగారికి ధైర్యంచెప్తూ.

అత్తగారు దానికేం సంతోషపడలేదు. బరువుగా లేచింది.

'సరే! నా పెద్ద కొడుకు పెళ్ళి కాబట్టి, పిలవ్వలసిన విధాయకం కాబట్టి పెళ్ళికి రమ్మని వేడుకొంటున్నాను. తర్వాత మీ ఇష్టం. వెళ్ళొస్తా' అంటూ తనచిన్న కూతురిని తీసుకు బయిల్దేరింది. శివరావు వాళ్ళతో వీధి గుమ్మందాకా వచ్చి

**పెండ్యాల నాగాంజనేయులు**

'అత్తగారూ! మీరేం బెంగపడకండి, మేమూ తప్పకుండా పెళ్ళికొస్తాం. అదొక్తి పిచ్చిది. దాని మాటలకు మీరేం బాధపడకండి' అని మేక పోతు గాంభీర్యంతో ధైర్యం చెప్పి సాగనంపాడ; నెమ్మదిగా లోపలి కొచ్చాడు.

నిప్పులు కక్కే కళ్ళతో పార్వతి 'హబ్బ! అత్తగారంటే ఏం భక్తి! ఏం గౌరవ? ఆహాహా! మానాభి మానాలుండాలి మనుషులికి'-అంటూ మీదిమీదికి వచ్చి బుగ్గలు పొడిచి నంత పని చేసింది.

'ఏమిటి పార్వతీ నీ పిచ్చి? ఇష్టం లేకపోతే నోర్మూసుకుండాలి గాని ఏమిటా కట్టువిరుపు మాటలు? అస హ్యంగాను?' చీదరించు కున్నాడు శివరావు.

'అవునవును! నామాటలసహ్యంగా వుంటాయి. పాపం! మీ మాటలే మహా ముద్దొస్తూ వుంటాయి. అందు కేగావన్ను ఆ అత్తగారు చింకి చేటంత మొహాం చేసు కెళ్ళింది. ఇంకేం! వెళ్ళండి వివాహా మహో త్సవానికి! మెచ్చు మేక తోలూ, పొగిడి పులి తోలూ కప్పుకొడు' ఝాడించేసింది పార్వతి. శివరావుకి కొంచెం కోపం వచ్చింది. అయినా సంబాళించుకుని 'అదేమిటే అలా ఎగిరి పడతావు? ఇటు చూడు! నేచెప్పేది కాస్త విని ఆలోచించు. అక్క, బావ, సొంత బావమరిది పెళ్ళికి వెళ్ళకపోవడం ఏమన్నా బాగుంటుందా? లోకం దృష్టి సంగతి వదిలెయ్. అసలు మనకే న్యాయంగా బాగుంటుందా అని' అంటూ ఆమె గడ్డం పుచ్చుకోబోయాడు.

ఆ చేతి నొక్క తోపు తోసింది పార్వతి. 'ఆ విషయం నేను బాగా ఆలోచించాను. ఈ పెళ్ళికే గాదు. అసలు వాళ్ళింటికే మనం వెళ్ళక పోవడం చాలా మంచిది; ఆరోగ్యం కూడాను.' తెగేసి చెప్పింది పార్వతి.

'అలా అంటే ఎలా? మనిద్దర్లో కనీసం ఎవరో ఒకళ్ళయినా వెళ్ళక పోతే...'

'ఓహో! అదా సంగతి? నే నెలాగూ వెళ్ళనని భీష్మించాను కాబట్టి తమరు వెడదామనా?...'

'అహఁ! అదికాదు! నేను కూడా వెళ్ళకపోతే ఏమను కుంటారో చూడు.'

'అంటే ... నేను అప్రదిష్ట పాలయ్యేదాన్నీ ... మీరు మాత్రం పేరు గడించుకునే వారూ నన్న మాట! ఏం? సిగ్గుండాలండీ మనుషులై పుట్టాక ...'

ఈ మాటతో శివరావుకి ఛర్రుమంది. 'అయినా నీతో వాదించడం నాదే బుద్ధి తక్కువ. ఎవరితో ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో కూడా తెలియని మొద్దువి. నువ్వే మయితే నాకేం! నే వెళ్తాను' అన్నాడు శివరావు విసుగ్గా.

ఒక్క నిముషం స్తంభించింది

పార్వతి. 'వెళ్తారాలే ... సరే వెళ్ళండి చెప్తాను" అని జోసిరించింది:

"ఏం వెళ్తే? తలదీసి మొలేస్తావా!" శివరావు గద్దించాడు.

"ఏం జరుగుతుందో మీరే చూద్దురుగాని" అంటూ రివ్వున వెళ్ళిపోయింది పార్వతి.

"ఏమిటి తెలిసేది? గాడిద గుడ్డు" అనుకొని వంకినున్న చొక్కా తొడుక్కుని అంతకన్నా కోపంగా వేగంగా వీధిలోకెళ్ళాడు శివరావు.

● ● ●


పార్వతి పెద్ద తమ్ముడు సత్యం. మద్రాసులో ఓ గుమాస్తా ఉద్యోగం చేసుకుంటూ నెలకు నూట యాభై రూపాయలు తెచ్చుకుంటున్నాడు. ఇతడికే మద్రాసులో పెళ్ళి. రెండో తమ్ముడు కృష్ణ. పార్వతి ఉండే ఊళ్ళోనే బడిపంతులు చేస్తూ ఓ వంద రూపాయలు సంపాదిస్తాడు. ఆ జీతం మీదే తల్లీ, పక్షవాతంతో బాధపడే తండ్రీ, చెల్లెలూ, తానూ ఓ పాతిక రూపాయల అద్దె ఇంట్లో వుంటూ గుట్టుచప్పుడు గాకుండా కాలక్షేపం చేస్తున్నాడు. సత్యం వల్ల వీళ్ళకప్పుడప్పుడూ పదీ పరకా సాయం దొరుకుతూంటుంది.

పార్వతి భర్త శివరావు మాత్రం ఓ డబ్బయి రూపాయలు సంపాదించేవాడు ఓ పచారు కొట్లో లెక్కలు రాసి. దానిమీదే తానూ, భార్యా, ముగ్గురు పిల్లలూ బతుకుతున్నారు ఓ 20 రూపాయల పూరింట్లో.

షుమారు రెండునెల్ల క్రితం పార్వతికో అద్భుతమైన ఆలోచన తట్టి, భర్తకు చెబితే అతనామోదించలేదు. అయినా సరే భర్తమాట వినకుండా, నెమ్మదిగా తల్లిదగ్గర కెళ్ళి ఏడుస్తూ ఓ పాచిక వేసింది. ఏడ్పు పనిచేసింది. ఇంతకీ ఏమిటా ఏడ్పూ?

పార్వతి సంసారమూ తల్లి సంసారమూ కలిసి ఓ ముప్పయ్యయిదు రూపాయల యింట్లో నివసించడం. కృష్ణ సంపాదనా తీసుకొచ్చి తల్లి దోసిట్లో పొయ్యడం: ఆమె ఈ మొత్తం సంసారాన్ని పస్తు పెట్టకుండా సమానంగా ఈదుకు రావడం.

పాపం! ఆ తల్లి కూతురిమీద జాలిపడి కృష్ణను సమాధానపరచి వత్తిడిపెట్టేసి 35 రూపాయలకు ఓ మంచి అద్దెఇల్లు చూసింది. ఆ యింటియజమాని అడిగిన ఓ నెల ఎడ్వాన్సు నిమిత్తం కృష్ణ 20 రూపాయలిచ్చాడు. పార్వతి తన భర్తచేత 15 రూపాయిలిప్పించింది ఎడ్వాన్సు. ఇచ్చిన వారం రోజులకు రెండు సంసారాలు కొత్తయింటో చేరి పాలుపొంగించుకుని. కాసింత తీపి చూడొచ్చిన వాళ్ళకి, చుట్టుపక్కల వాళ్ళకీకూడా తినిపించారు. ఐతే ఆ రోజు శుక్రవారం కావడంవల్ల, పాత ఇళ్ళను ఖాళీ చెయ్యడం మర్నాటికి




వాయిదా వేశారు. ఆ రోజే ఓ విశేషం జరిగింది.

శివరావు మధ్యాహ్న భోజనార్థం ఇంటికి వస్తుండగా, కాకతాళీయంగా ఓ పెద్ద బట్టలషాపు యజమాని కనబడి, అతని యోగక్షేమాలూ, ఉద్యోగం జీతం వగైరాలు విచారించి; జాలిపడి తన షాపులో నూట ఇరవై రూపాయల ఉద్యోగ మిచ్చాడు. వెంటనే ఎడ్వాన్సుగా ఓ ఏభయి రూపాయలు కూడా ఇచ్చేశాడు. శివరావు ఆనందంతో ఉక్కిరి బిక్కిరయి, ఆ పూటకి హోటల్లో భోంచేసి, ఆ మధ్యాహ్నమే పాత ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి కొత్త ఉద్యోగంలో చేరిపోయాడు.

ఆ రాత్రి పార్వతికి కొత్తవార్త విన్నప్పటి నుంచి నిద్ర పట్టలేదు. ఒకటే ఆలోచన. తన భర్త జీతం తక్కువ. తమ్ముడి జీతం ఎక్కువ గనుక, తన సంసారానికి లాభంగా ఉంటుందనే సదుద్దేశంతో రెండు సంసారాల్నీ ఏకంచెయ్యబోతోంది తాను. తీరా తన భర్త ఎక్కువ సంపాదించబోతున్నాడు! అనుకున్నప్రకారం రెండు సంసారాలూ ఏకమయితే ... ఇంకేముంది? తన సంసారానికి నష్టమేనాయె! అందుకే వెంటనే నిద్రపోతున్న శివరావుని లేపి "ఏమండీ! మనం ఈ ఇంట్లోనే ఉండిపోదాం. వాళ్ళతో కలవద్దు. నేను బాగా ఆలోచించి చూశాను! ఇలా కలవడం ఎవ్వరికీ మంచిది

కాదు. ఓ పోరూ పొత్తూ లేకుండా ఎవరి మానాన వాళ్ళం బ్రతుకుతున్నాం. ఒకరికొకరు దూరంగా ఉంటేనే చుట్టరికాలూ మర్యాదలూ నిలుస్తాయి' అంటూ హితబోధ మొదలెట్టింది.

శివరావు చిరునవ్వు నవ్వుతూ 'లేలిది వరహా ల్చెప్తే విల్లావ్?' అన్నాడు ఆవులింతకు చిటికెలు కొడుతూ.

'నిజమేలెండి! మీరు కూడా అప్పుడప్పుడూ కరెక్టుగానే చెప్తారు.' అంది పార్వతి. శివరావు బండనిద్ర పోయాడు.

తెల్లారుతుండగానే పార్వతి తన తల్లి దగ్గరకు పరుగెత్తి వెళ్ళింది. అప్పటికి ఇంకా ఎవరూ నిద్ర లేవలేదు తల్లితప్ప. తల్లితో రాత్రి మర్యాదలూ చుట్టరికాలూ గురించి తన భర్తకు చెప్పిన పాఠమే చెప్పింది. అయితే ఆ పాఠం సృష్టికర్త తను కాదనీ, తన భర్తేననీ వినేయతతో విన్నవించింది. తల్లి ఎంతగానో ప్రయత్నించింది పార్వతిని ఒప్పించాలని. వింటేగా? పైగా 'అమ్మా! ఆ యింటికిచ్చిన అడ్వాన్సు పదిహేను రూపాయలూ కొంచెం త్వరగా ఇమ్మని చెప్పు తమ్ముడితో, డబ్బులేక నానా అవస్థ పడుతున్నాం' అంటూ చెప్పేసి తల్లి సమాధానం కోసం కూడా ఎదురు చూడకుండా ఇంటికి పరుగెత్తింది. తల్లి కొయ్యబారిపోయింది. కృష్ణ తల్లిద్వారా అంతా విన్నాడు. అరికాలిమంట నెత్తికెక్కింది. అయినా తల్లి మీది గౌరవం కొద్దీ అంతా అణగదొక్కుకున్నాడు. ఆరోజే తాముండే ఇల్లు తప్పని సరిగా ఖాళీ చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడ్డంవల్ల కొత్త యింటికి తన సంసారాన్ని మార్చేశాడు - తలకి మించిన బరువని తెలిసి కూడా.

పార్వతి, తన తమ్ముడింటో వుండని వేళల్లో తల్లి దగ్గరకెళ్ళి ఎడ్వాన్సుగా ఇచ్చిన 15 రూపాయలూ తెమ్మని కూర్చునేది. ఇలా అయిదారు సార్లు తిరిగి ఓ పది రూపాయలు దక్కించుకుంది పార్వతి ప్రవర్తనా, ఆమె పెట్టే వత్తిడీ కృష్ణకే కాదు - తల్లీ, తండ్రీ, చెల్లెలుకూడా కష్టంగానే తోచింది. పార్వతివల్లే వాళ్ళంత రొంపిలో దిగబడ్డారు. అసలు తిండికీ, దినవెచ్చానికీ కష్టంగానే వుండే పరిస్థితిలో కాబూలీవాడిలా పార్వతి తయారు ఇవ్వలేనని గానీ చెప్పలేక పోతున్నాడు కృష్ణ. రేపిస్తా, మాపిస్తా అని వెళ్ళమారుస్తాడు. అతను చెప్పినట్టే తల్లికూడా సమాధానం చెప్తోంది. కాని ఈ నిర్ణయం ఎంతో కాలం నిలవలేదు.

మరోనాడు పార్వతి వచ్చిందీ బాకీ వసూలు చేసుకునేందుకు, ఆ సమయంలో అంతా వున్నారింట్లో.

పార్వతి నాలుక ఆర్నోజు మరీ పదునుగా వుంది. తప్పంతా వాళ్ళ నెత్తినే తోసేసి, ఇన్నాళ్ళుగా ఇంత ఓపికతో తిరుగుతున్నందుకు 'నేను చాలా ఉత్తమురాల్ని' అని పొగుడుకుని, మిగిలిన 'ముష్టి అయిదు రూపాయిలు' వెంటనే ఇవ్వకపోతే వాళ్ళ మర్యాద దక్కడం కష్టమని హెచ్చరించింది. దాంతో కృష్ణ రేగాడు. పార్వతి నైజాన్నిగురించి, వేసే ఎత్తుల్ని గురించీ చెడామడా చెరిగేశాడు. పైపెచ్చు 'నీ భర్త దేవుళ్ళాంటి వాడు. నువ్వే మరీ రాక్షసివి' అని శూలనాదేశాడు. దానికి చెల్లెలు వంతపాడింది. 'బావగారు నిజంగానే ఉత్తములు. ఆయనకిలాంటి ఛండాలబ్బుద్ధుల్లేవు' అని.

ముసలితండ్రికూడా 'ఆ మాట నిజమేలే! ఏమంటావేఁ?' అన్నాడు భార్య వంకచూసి.

'నిజమే ననుకోండి...' అని సాగదీసిందామె—పాపం భర్త మాట కెదురాడని సత్యకాలపు ముత్తైదువ.

శూలాల్లాంటి ఈ మాటలతో పార్వతి దెబ్బతిన్న ఆడ పులిలా గాండ్రించింది. చిందులు తొక్కింది తన తండ్రి వంశాన్ని ఏడు తరాలు (వెనకటి) వరకూ తరిమి తరిమి తిట్టింది. 'ఘూ' అని ఉమ్మేసింది. 'నాకు బుద్ధి లేక మీ గడప తొక్కాను' అంది. 'ఆ అయిదు రూపాయలతో మీరు బాగుపడి మేడలూ మిద్దెలూ కట్టుకుని, కార్లూ రేడియోలూ కూడా కొనుక్కోం'డంది. 'ఇక మీకూ మాకూ సంబంధాలు లేవు. ఒకరి గుమ్మం ఒకరు తొక్కితే గాడిద కడుపున పుట్టినంత ఒట్టు' అని ఒట్టేసి, ధారలు కట్టే కన్నీళ్ళతో ఇంటికి చేరి, భర్తతో విషయమంతా చెప్పింది.

శివరావు బైరాగిలా కూర్చున్నాడు 'ఊఁ! ఆఁ!' అనకుండా దమ్ముకొడ్తూ తనను తిడుతూ, తన భర్తను వాళ్ళు పొగిడిన విధమంతా, ఒక్క మాటకూడా విడవకుండా ఖచ్చితంగా అంటూ వందసార్లు గంజుకుంది.

శివరావు అర్ధ నిమీలిత నేత్రాలతో, చిరునవ్వు నవ్వుతూ పద్మాసనం వెనుక్కూర్చుని బుద్ధుడిలా పోజు పెట్టాడు.

నోరు నెప్పి పుట్టింది పార్వతికి. దాంతో దగ్గూ, పడిసెం, ఆయాసం, దడ, నీరసం, నిస్సత్తువ, రొప్పు, రోషం, క్రోధం వగైరా గుణాలు పుట్టి, ఆమెతో మెట్రిక్ తులా మానం ప్రకారం రెండు లీటర్ల కన్నీళ్ళు కార్పించాయి. స్తబ్దుగా వున్న శివరావు వంక చూసి 'ఛీ!

చీమూ నెత్తురు లేని మనుషులు! ఇలాటి వాళ్ళకి భార్యెందుకు? బండ రెందుకు?' అని కసిగా విసుక్కొని పడుకుంది ఫోం చెయ్యకుండా.

శివరావు హాయిగా ఫోం చేసి పడుకున్నాడు.

ఆనాటినుండీ పార్వతికీ, పుట్టింటి వారికీ రాకపోకలు నశించాయి. ఇదీ పూర్వ కథ.

పార్వతికన్నా వేడిగా వీధిలో కెళ్ళిన శివరావుకు పెళ్ళికి వెళ్ళి తీరాలనే పట్టుదల ఎక్కువయింది. ఇన్నాళ్ళుగా ఏ విషయంలో నైనా తనే తగ్గిపోయి పార్వతికే నెగ్గే అవకాశం కలిగించేవాడు సంసారం రచ్చ కెక్కుతుందని. ఇకమీద అలా జరగడానికి వీల్లేదు. తన పంతం నెగ్గాలిసిందే. పార్వతి రోగం కుదర్చాలిసిందే. పెళ్ళి కెళ్తే ఏమిటో చేస్తుందట, ఏమిటి చేసేది? ఇదివరలో అంతే పార్వతి ఎప్పు డయినా కోపంవస్తే బడబడా పుట్టింటికిపోయి కూర్చునేది. శివరావే వెళ్ళి బ్రతిమాలి తీసుకొచ్చేవాడు. ఇప్పుడు పార్వతికి ఆ అవకాశమే లేదు. మరేం చేస్తుంది? పిల్లల్ని చావ బాదుతుంది.

మరేం ఫర్వాలేదు. పోతే... ఉరి పోసుకుని ... ఛఛ! దరిద్రపాలో చన... ఆఁ! అలాంటివేం చేయదు లెద్దూ ... మహా అయితే పస్తులుంటుంది. ఉండనీ! మాయరోగమూ? బియ్యం కదా అవుతాయి. ఆరోగ్యం మరింత వృద్ధవుతుంది.

అయినా బయల్దేరేప్పుడు పార్వతితో చెప్పాలని సిద్ధాంత మేమిటి? గుప్ చిప్ గా జారుకుని ఎవరితోనైనా కబురుచేస్తే సరి. తర్వాత!

ఈ నిర్ణయానికి రాగానే శివరావు ఇంటికొచ్చేశాడు. స్నానం చేసి గుడ్డలు కట్టుకుంటుండగా పార్వతి వరల్లో నూతిదగ్గర చాకి రేవు పెట్టింది. చంటివాడు ఆమె పక్కనే ఆడుకుంటున్నాడు. పెద్ద పిల్లలిద్దరూ (7ఏళ్ళు, 5ఏళ్ళు) చద్దన్నాలు తిని బడి కెళ్ళిపోయారు అంత క్రితమే.

శివరావు కిది మంచి అదను. చేతి సంచీలో గబగబా రెండు జతల బట్టలు కుక్కేసి మెల్లగా జారుకున్నాడు.

సాయంత్రం ఏడు గంటలకల్లా శివరావు తన యజమాని దగ్గర నాలుగు రోజులు సెలవు, అరవై రూపాయల అడ్వాన్సు సంపాదించాడు. షాపులో పనికుర్రాణ్ణి పిల్చి, తను పెళ్ళికి మద్రాసు వెళ్ళిన విషయం ఇంటిలో చెప్పి రమ్మని పంపించేసి స్టేషనుకు పరుగెత్తాడు.

తీరా స్టేషనులో కాలుబెట్టాక

ఈ మాటికి కుర్రాడు పార్వతికీ వార్త చెప్తూ వుంటాడు. పార్వతి ఎలాంటి సంచలనానికి గురయిందో?!' అనుకున్నాడు శివరావు. అలాగే నిలబడిపోయి 'బహుశా పిల్లల్ని చావగొట్టడం లేదుగదా? ... లేకపోతే ఉరి పోసుకో... అదేం వీలులేదులే! అసలే ఇంటికి వచ్చిపోయిన నాసాలు, పైగా ఇల్లు ఎత్తు బహు తక్కువ. ఒకవేళ నూతిలో దూకలేదుగదా? ఏమో ... ఎప్పుడూ 'దూకుతా దూకుతా' అనడమే గాని ఆ పని మాత్రం చెయ్యలేదు. అసలంత వరకూ వెళ్ళేవరకూ అవకాశం ఆమెకు ఏనాడూ తను కలగజెయ్య లేదు. కాని... ఈరోజున లాంటి అవకాశం కలిగించినవాడయ్యాడేమో అనుకో?' ఆట్టే ఆలోచిస్తే తను ఎప్పటినన్నా బాగా నూకుడుగా వున్న మాట నిజమే ... ఈ పరిస్థితిలో పార్వతి ఆ పని చేసినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. అలాటిదే జరిగితే పిల్లలగతేమిటి? తన గతేమిటి? గతిమాట దేవుడెరుగు, లోకమంతా భార్య చావుకు కారణం తనేనని వేలెత్తిచూపిస్తారే... ఛ! అలాటిదేమీ జరగడానికి వీల్లేదు. ఆలోచించి, ఆలోచించి బుర్ర వేడెక్కింది శివరావుకు. అతని పట్టుదల సడలిపోయింది. ఇహ టిక్కెట్టు కూడా కొనబుద్ధి పుట్టలేదు. వెనక్కి తిరిగాడు. 'నేనే ఓడిపోయాను. ఆమే గెలిచింది. ఎప్పటిలాగా ఆమెనే గెలవనీ!' అనుకుంటూ.

గబగబ నడక సాగించాడు. తన ఇల్లువుండే వీధి మలుపు తిరిగాడు. ఎక్కడెక్కడి జనం హడావిడిగా తన 'ఇంట్లో'కే పరుగెత్తుకున్నారు. శివరావుకు గుండెదడ పట్టుకుంది. పరుగెత్తాడు. వీధి గుమ్మంలోనే తన పెద్ద పిల్లలిద్దరూ బ్యారే మని ఏడుస్తూ వచ్చారు. 'నాన్నా! అమ్మ' అంటూ...

---

- *ఇద్దరు రుమేనియన్ కార్మికులు ఫ్యాక్టరీ నుంచి ఇళ్ళకు తిరిగి వెళుతున్నారు. ఇద్దరి మొహాలు గంభీరంగా ఉన్నాయి. ఇద్దరిలో ఎవ్వరూ మాట్లాడ్డంలేదు. ఏదో ఆలోచిస్తున్నారు. చివరి కొకడు నిట్టూర్చి తనప్రక్కన ఉమ్మేశాడు. రెండో వాడు కూడా వెంటనే ఉమ్మేశాడు.*

  *మొదటివాడు "చాలు చాలు. ఎవరన్నా చూస్తే మనం రాజకీయాలు మాట్లాడుకుంటున్నామని అనుకుంటారు"*

పెరట్లో నూతిదగ్గర ముట్టూ జనం మూగి వున్నారు. ఏవేవో రకరకాల మాటలు వినబడుతున్నాయి 'జాగ్రత్తగా లాగండి' 'అరెరె! తలకి బాగా దెబ్బలు తగిలాయి' 'ప్రాణానికి మోసం లేదు గదా' శరీరాలు... శివరావు వూహించినది నిజమే! గుండెలు పగిలిపోయాయి అతనికి...

పిల్లల్ని వదిలించుకుని 'పార్వతీ! పార్వతీ! నేనే ఓడిపోయా పార్వతీ!' అని పిచ్చిగా కేకలేస్తూ నూతి దగ్గరకు పరుగెత్తాడు జనాన్ని తోసుకుంటూ.

జనంమధ్యలో గాయాలతో, అప్పుడే నూతిలోనుంచి తీయబడిన ఇంటివారి గేదె దూడ పడుకుని వుంది!

శివరావుకు మతి పోయినంత పనయింది.


## చందాదారులకు మనవి

*పాత చందాదారులు తిరిగి చందా పైకం పంపేటప్పుడు మీ చందా నెంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.*

మేనేజరు, 'జ్యోతి'


ఇంతలో ఇంటి యజమాని అతణ్ణి చెయ్యి పుచ్చుకుని వెనక్కి లాగి, ఓ మడతపెట్టిన కాగితమూ, ఇంటి తాళం చెవీ ఇచ్చాడు. 'పార్వతమ్మగారు మీకిమ్మన్నారండీ' అంటూ.

త్వరత్వరగా తాళంతీసి, పిల్లలతో ఇంట్లో ప్రవేశించి కాగితం చదవడం మొదలెట్టాడు శివరావు.

'పూజ్యులైన భర్తగారికి,

పార్వతి నమస్కారములు. నేనే ఓడిపోయాను. పెళ్ళికి ఎవరో ఒకరైనా వెళ్ళాలన్న మీరే గెలిచారు. సాయంత్రం 5 గంటలకు మా అమ్మ నాకోసం ఏభయి రూపాయిలు, పట్టుచీరె తెచ్చింది. పెళ్ళికి రమ్మని గోలపెట్టింది. ఏమిటో... ఆవిడ ముఖం చూస్తే రాలేనని, రాననీ చెప్పలేకపోయాను. కాబట్టి మా వాళ్ళతో బయల్దేరి రాత్రి మెయిలుకు వెళ్తున్నాను. ఈ విషయం పెద్ద పిల్లలిద్దరికీ తెలియదు. ఇంకా బడినుంచీ, ఆటలనుంచీ రాలేదు. మన ఇంటాయన దగ్గర ఓ పాతిక రూపాయలు అప్పు తీసుకున్నాను. అది మీరు తీర్చెయ్యాలండీ'

ఇలా

మీ పాదదాసి

పార్వతి'

శివరావుకు నోట మాట లేదు. మెదడులో చైతన్యం లేదు.

□□□